క్లుప్తంగా

క్రీడలతో మానసిక ఉల్లాసం


విద్యార్థులను అభినందిస్తున్న డిప్యూటీ మేయర్ గోవింద్‌రెడ్డి

మల్కాపురం: క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు రాణిస్తే మంచి గుర్తింపు ఉంటుందని డిప్యూటీ మేయర్ గోవింద్‌రెడ్డి అన్నారు. 58వ వార్డు పిలకవానిపాలెంలోని లక్కీ అమర్ పాఠశాలలో 15 పాఠశాల విద్యార్థులకు శనివారం చెస్,క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. ఏమిస్ అకాడమీ గ్రూప్ ఆఫ్ సూల్స్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో సత్తాచాటాలన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులను ఆయన అభినందించారు.

జీవో 143ను రద్దు చేయాలని ఆందోళన

బీచ్‌రోడ్డు: ప్రభుత్వం జారీ చేసిన 143 జీవో వల్ల సీనియర్ ఎంపీహెచ్‌ఏ సిబ్బందికి తీవ్రమైన అన్యాయం జరుగుతుందని, దీనిపై ప్రభుత్వం పునరాలోచించాలని ఏపీ ప్రభుత్వ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షురాలు ఎం. వెంకటలక్ష్మి కోరారు. ఈ మేరకు శనివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ జీవో ప్రకారం కేవలం 14 మంది స్టాఫ్ మాత్రమే ఉండాలన్న నిబంధనతో వేలాది మంది ఎంపీహెచ్‌ఏ సిబ్బంది ఉద్యోగ భద్రత సమస్యతో పాటు ప్రమోషన్ అవకాశాల్లో కోత పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 33 ఏళ్లుగా అదే క్యాడర్‌లో కొనసాగుతున్న సీనియర్ మహిళా హెల్త్ అసిస్టెంట్లు ఈ జీవో వల్ల సూపర్‌వైజర్ క్యాడర్‌కి మారే అవకాశం పూర్తిగా కోల్పోతారన్నారు. ప్రభుత్వం పునరాలోచించి ఆ జీవోను రద్దు చేయాలని కోరారు.

రైల్వేస్టేషన్‌లో 8.4 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో గంజాయిని అక్రమ రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 8.480 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. విశాఖ రైల్వే స్టేషన్‌లోని పలు ప్లాట్‌ఫారాల్లో శనివారం జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ఒడిశా గంజాం జిల్లాకు చెందిన బురుగ ఆనంద్‌కుమార్, తెలంగాణ రంగారెడ్డి జిల్లాకు చెందిన సురకల హరికృష్ణ, కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లాకు చెందిన రోహిత్‌లు విశాఖ రైల్వే స్టేషన్ మీదుగా ముంబైకు గంజాయిని అక్రమంగా రవాణా చేయడాన్ని గుర్తించారు. వీరిని అదుపులోకి తీసుకుని రూ.42,400 విలువైన 8.480 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

జర్నలిస్టుల సమస్యలను సత్వరం పరిష్కరించాలి


ఐ అండ్ పీఆర్ నూతన డైరెక్టర్ విశ్వనాథన్‌ను సన్మానిస్తున్న ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు

విశాఖ సిటీ: రాష్ట్రంలో జర్నలిస్టులు సుదీర్ఘకాలంగాఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ఐ అండ్ పీఆర్ నూతన డైరెక్టర్‌గా నియమితులైన కె.విశ్వనాథన్‌ను ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ కార్యవర్గం కోరింది. శనివారం వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, విశాఖ జిల్లా అధ్యక్షుడు పి.నారాయణ, కార్యదర్శి జి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు బి.శివప్రసాద్‌లు నూతన డైరెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం జర్నలిస్టులకు సంబంధించిన పలు అంశాలను డైరెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాదిన్నర పూర్తికావస్తున్నా ఇప్పటికీ జర్నలిస్టులకు నూతన అక్రిడేషన్లు మంజూరు కాలేదన్నారు. అలాగే చిన్న, మధ్యతరహా పత్రికలకు సంబంధించి తాజా జీవో ప్రకారం కొద్దిగా మార్పులు చేయాల్సి ఉందని తెలిపారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని, ఇతర రాష్ట్రాల మాదిరిగా పెన్షన్ సదుపాయం కల్పించాలని కోరారు. దీనిపై నూతన డైరెక్టర్ విశ్వనాథన్ సానుకూలంగా స్పందించారు. తన పరిధి మేరకు సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. సోమవారం అమరావతిలో బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిపారు.


కోస్టుగార్డుకు వెళ్లే మార్గంలో కురుస్తున్న పొగమంచు


జింక్ గేటు నుంచి గాజువాక ఆర్టీసీ డిపోకు వచ్చే మార్గంలో..

మంచుకురిసే వేళలో..

పారిశ్రామిక ప్రాంత వాసులు ఏజెన్సీలో ఉన్న అనుభూతిని పొందారు. శనివారం ఉదయం 6 గంటల సమయంలో మల్కాపురం,కోస్టుగార్డు,శ్రీహరిపురం,నక్కవానిపాలెం,జింక్ ఏరియా,గాజువాక ఆర్టీసీ డిపో తదితర ప్రాంతాల్లో పొగమంచు దట్టంగా కురిసింది. దీంతో ఆ సమయంలో రాకపోకలు సాగించే వాహనదారులతో పాటు వాకర్స్ ఎంజాయ్ చేశారు. అరకు ప్రాంతంలో ఉన్నట్టు ఉందని ఆనందం వ్యక్తం చేశారు. కొన్ని రోజుల నుంచి తెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఇలాంటి వాతావరణం ఏర్పడిందని వాతావరణశాఖ నిపుణులు తెలుపుతున్నారు. - మల్కాపురం

ఈ మార్గానికి మోక్షం ఎప్పుడో!

జీవీఎంసీ 58వ వార్డు పరిధిలో ఎదురవానిపాలెం నుంచి ములగాడ వెళ్లే మార్గంలో విద్యుత్ శాఖ సిబ్బంది చేపడుతున్న భూగర్భ విద్యుత్ కేబుల్ వైర్లు వేసే పనులు వాహనదారులకు పరీక్ష పెడుతున్నాయి. ములగాడ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల నుంచి ములగాడ సెంటర్‌కు వచ్చే వరకు, ములగాడ సెంటర్ నుంచి శ్రావణి షిప్పింగ్‌కు వెళ్లే మార్గంలో ఓ వైపు కేబుల్ వైర్ల ఏర్పాటుకు తవ్వకాలు జరిపారు. ఈ తవ్వకాలు చేసి రెండు వారాలు గడుస్తున్నా నేటికీ పనులు పూర్తి కాలేదు. మరోవైపు తవ్విన మట్టిని సేవా మార్గంపై విడిచిపెట్టడంతో వర్షాలకు మట్టి కరిగి సేవా మార్గంపైకి వచ్చి రోడ్డంతా బురద మయంగా మారుతోంది. దీంతో వాహనాలు అదుపు తప్పి పలువురు గాయాల పాలవుతున్నారు.దీంతో ఈ మార్గానికి ఎప్పుడు మోక్షం కలుగుతుందోనని ములగాడ గ్రామస్తులతో పాటు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - మల్కాపురం


ఎదురవానిపాలెం నుంచి ములగాడ వచ్చే మార్గం తవ్వకాలు


ములగాడ నుంచి శ్రావణి షిప్పింగ్‌కు వెళ్లే మార్గం దుస్థితి

కురిసింది వాన


ఎన్‌ఏడీలో కురుస్తున్న వర్షం


గోపాలపట్నం బస్ స్టాప్ వద్ద నిలిచిన వర్షపు నీరు

గోపాలపట్నం: అప్పటి వరకూ ఎండ.. అంతలోనే మబ్బులు కమ్మేసి శనివారం మధ్యాహ్నం వర్షం దంచికొట్టింది. దీంతో ద్విచక్రవాహనదారులు నిలిచి పోయారు. షెల్టర్ల కోసం పరుగుల తీశారు. సుమారు గంట పాటు కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. చెరువులను తరలిపించాయి. బీఆర్‌టీఎస్ రహదారిలో చాలా చోట్ల మోకాలి లోతు వరకు నీరు నిలిచిపోయింది. గోపాలపట్నం బస్ స్టాప్ వద్ద వర్షం నీరునిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. వాహనాలు రాకపోకలు సాగిస్తుండడం వల్ల నీరు పైకి చిమ్ముతుండడంతో తడిసి ఇబ్బందులు పడ్డారు.

రాకపోకలెలా?


శ్రీహరిపురం సర్వీసురోడ్డులో డంప్ చేసిన భవన నిర్మాణ సామగ్రి

ఫోకస్

మల్కాపురం: అసలే 58వ వార్డు శ్రీహరిపురం పాతరామాలయం వీధి మార్గం ఇరుకు.. దానికి తోడు ఆ మార్గంలో భవన నిర్మాణానికి వినియోగించే కాంక్రీట్ పిక్క నిర్లక్ష్యంగా డంప్ చేశారు. దీంతో శనివారం ఆ మార్గంలో రాకపోకలు సాగించిన వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికారులు స్పందించి రోడ్డుపై నిర్మాణ సామగ్రి వేయకుండా చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు.

సుందరీకరణ పనుల పరిశీలన


పార్కులో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడాలేఅవుట్ గ్రీన్ బెల్టులో సుందరీకరణ పనులను శనివారం మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పరిశీలించారు. కోల్‌కతా నుంచి తీసుకువచ్చిన గ్రీన్ గ్రాస్‌ను గ్రీన్ బెల్టు వాకింగ్ ట్రాక్ వద్ద వేస్తున్న తీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీన్ బెల్టులను అభివృద్ధి చేసిన ఘనత 52వ వార్డుకే దక్కిందని అన్నారు. తన ఆలోచనలను అమలు చేసేందుకు అధికారులు సహకరించారని అందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పచ్చదనాన్ని, వాకింగ్ ట్రాక్‌లను కాపాడు కోవడం అందరూ బాధ్యతగా స్వీకరించాలని కోరారు. ప్లాస్టిక్ వస్తువులు, సంచులు వేయకుండా స్వీయ నియంత్రణ పాటించాలన్నారు. వుడాలేఅవుట్ వనితా వాకర్స్ అసోసియేషన్, హెల్తీ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, వుడాలేఅవుట్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సహకరించాలని కోరారు. ఈ ప్రాంతంలో టాయ్‌లెట్లు కూడా ఏర్పాటు చేసేందుకు అధికారులతో చర్చిస్తానని తెలిపారు. కార్యక్రమంలో పారిశుధ్య విభాగం అధికారి మూర్తి, అప్పారావు, ప్రేమ్ రెడ్డి, బాలయోగి, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భెల్ గుర్తింపు యూనియన్ ఎన్నికల ప్రక్రియకు శ్రీకారం


బీహెచ్‌ఈఎల్ పరిపాలన భవనం

గాజువాక: స్థానిక బీహెచ్‌ఈఎల్ యూనిట్‌లో గుర్తింపు యూనియన్ ఎన్నికల ప్రక్రియకు అధికారులు శ్రీకారం చుట్టారు. సంస్థలో ఉన్న అన్ని రిజిస్టర్డ్ యూనియన్లు తమ ఒరిజినల్ డాక్యుమెంట్లను యాజమాన్యానికి పది రోజుల్లోగా పంపించాలని సర్క్యులర్ వెలువడడంతో సందడి మొదలైంది. ప్రస్తుత గుర్తింపు యూనియన్ 2023 ఆగస్టు 31న ఎన్నికైన విషయం తెలిసిందే. ఆ యూనియన్ గుర్తింపు కాలం ఈ ఏడాది ఆగస్టుతో ముగిసింది. ఈ నేపథ్యంలో రిజిస్టర్డ్ యూనియన్ల డాక్యుమెంట్లను సేకరించాల్సిందిగా ఆదేశిస్తూ హైదరాబాద్ లేబర్ కమిషనర్ నుంచి స్థానిక యాజమన్యానికి సర్క్యులర్ వచ్చింది. దీంతో ఆయా యూనియన్ల నాయకులు తమకు సంబంధించిన డాక్యుమెంట్లను సిద్ధం చేస్తున్నారు. ఎన్నికలు ఎప్పుడైనా జరిగే అవకాశం ఉందని భావిస్తున్న నాయకులు ఇప్పటి నుంచే ఎత్తుగడల్లో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం సంస్థలో 340 మందికిపైగా ఓటర్లు ఉన్నట్టు కార్మిక వర్గాలు తెలిపాయి.

ఘనంగా వార్షికోత్సవ వేడుకలు


సత్కారం పొందిన సిస్టర్లతో అతిథులు

కంచరపాలెం: సిస్టర్స్ ఆఫ్ సెయింట్ జోసెఫ్ ధార్మిక సంఘం ప్రారంభమై 375 వసంతాలు పూర్తయిన సందర్భంగా శనివారం సాయంత్రం సిస్టర్స్ ఆఫ్ సెయింట్ జోసెఫ్ అన్నేసి విశాఖ ప్రావిన్స్ వేడుకలు జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ కళాశాలలో నిర్వహించారు. హైదరాబాద్ ఆర్చి బిషప్ మోస్ట్ రెవరెండ్ ఫాదర్ డాక్టర్ పూలా ఆంథోనీ, బిషప్ ఎమోరిటస్ రెవరెండ్ మల్లవరపు ప్రకాష్, ఫాదర్ సురేష్‌బాబు, సిస్టర్ రోజ్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. అణగారిన వారికి సేవ చేయాలనే తమ లక్ష్యంలో భాగంగా ప్రేమ, ఐక్యత, సేవ అనే స్థిరమైన సంకల్పంతో ముందుకు సాగిన ఆరుగురు ధైర్యవంతులైన మహిళలతో పాటు వ్యవస్థాపకుడు జాన్ పియర్ మెడైల్ (జెపీ)ను ఘనంగా స్మరించుకున్నారు. విశాఖ ఆర్చి బిషప్ రెవరెండ్ ఉడుముల బాల, రెవరెండ్ ఎం.ప్రకాష్ డిడి, ఆర్చి బిషప్ ఎమోరిటస్ ఫాదర్ బవిరి సురేష్‌బాబు, రెవరెండ్ ఫాదర్ డి.బాలశౌరి, రెవరెండ్ ఫాదర్ జె.జాన్‌ప్రకాష్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. హైదరాబాద్ ఆర్చి బిషప్ మోస్ట్ రెవరెండ్ ఫాదర్ డాక్టర్ పూలా అంథోనీ మాట్లాడుతూ ఆధ్యాత్మిక, సామాజిక రంగాల్లో నాలుగు శతాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా ప్రేమ, సేవలు అందిస్తున్న సిస్టర్లకు అభినందనీయమన్నారు. సుమారు 600 మంది సిస్టర్లను సత్కరించారు.

జీఎస్ఐతో ఏయూ ఒప్పందం


జీఎస్ఐతో ఎంవోయూ పత్రాలను మార్చుకుంటున్న ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిశోధన, అభివృద్ధి రంగంలో మరో ముందడుగు వేసింది. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్ఐ)తో ఏయూ శనివారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ సమక్షంలో ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఏయూ తరపున రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె. రాంబాబు, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, హైదరాబాద్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సత్య నారాయణ మహాపాత్రో సంతకాలు చేశారు. భారత ప్రభుత్వం నుంచి వచ్చిన ఇతర ప్రతినిధులు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎంవీఆర్ రాజు, పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య ఇఎన్ ధనుంజయ రావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సిమెంట్ ఫ్యాక్టరీ వద్దేవద్దు

- మళ్లీ ప్రజాభిప్రాయ సేకరణ ఎందుకు?
- ప్రశ్నించిన వామపక్ష నాయకులు


సంఘీభావం తెలుపుతున్న కార్పొరేటర్ స్టాలిన్ వామపక్ష నాయకులు

పెదగంట్యాడ: అభివృద్ధి అంటే ప్రజలకు మేలు చేసేలా ఉండాలని, వారి ప్రాణాలను హరించేలా ఉండకూడదని వామపక్ష నాయకులు అన్నారు. పెదగంట్యాడలో సిమెంట్ ఫ్యాక్టరీ పెడితే ఎంత ఉద్యమానికైనా సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ఈ మేరకు పోతిన సన్యాసిరావు భవన్‌లో వామపక్ష నాయకులు శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి, కార్పొరేటర్ ఏజె స్టాలిన్, గాజువాక నియోజవర్గ సీపీఐ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడారు. అంబుజా సిమెంట్స్ గ్రైండింగ్ యూనిట్ వల్ల ఈ ప్రాంతం కాలుష్యంతో నిండిపోతుందని, ఇప్పటికే గంగవరం పోర్టు కారణంగా కాలుష్యం కారణంగా అనేక సమస్యలు నెలకొని ఉన్నాయన్నారు. ప్రజామోదం లేకుండా ఈ ప్రాంతంలో ఎలాంటి పరిశ్రమలు ఏర్పాటు చేసినా ప్రతిఘటిస్తామని స్పష్టం చేశారు. పరిశ్రమలు రావాలే గానీ కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలు వద్దన్నారు. సిమెంట్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా ప్రజలంతా ఐకమత్యంగా పోరాటాలు చేస్తుంటే స్థానిక శాసనసభ్యులు, స్థానిక పార్లమెంట్ సభ్యులు నోరు మెదపకపోవడం వెనుక కారణమేంటో అర్థం కావడం లేదన్నారు. పరిశ్రమను అంతా వ్యతిరేకిస్తుంటే మళ్లీ ప్రజాభిప్రాయ సేకరణ చేస్తామని అధికారులు అంటుంటే ప్రజా ప్రతినిధులు ఖండించకపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తోందన్నారు. కార్యక్రమంలో రాంబాబు, దేవా, ఎం.వెంకటేశ్వర్లు, ఎస్.గోవింద రాజులు, డి.ఆదినారాయణ, వనజాక్షి, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

సిటు మహాసభల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిటు నాయకులు

డాబాగార్డెన్స్: సిటుఅఖిల భారత మహాసభలు తొలిసారి విశాఖలో ఈ ఏడాది డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు నిర్వహించనున్నారు. మహాసభల పోస్టర్ శనివారం సిటు కార్యాలయంలో ఆవిష్కరించారు. మహాసభలకు దేశవ్యాప్తంగా 70 లక్షల మంది కార్మికుల సభ్యత్వానికి ప్రాతినిధ్యం వహిస్తున్న 1500 మంది ప్రతినిధులు 29 రాష్ట్రాల నుంచి హాజరు కానున్నారు. ఈ మహాసభలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రధానంగా చర్చించనున్నారు. భవిష్యత్ పోరాటాలకు కార్యాచరణ రూపొందించనున్నారు. నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 12 ఏళ్ల నుంచి కార్మిక వ్యతిరేక విధానాలు అనుసరిస్తుందని సిటు 18వ అఖిల భారత మహాసభల నిర్వహణ కమిటీ ప్రతినిధి, సిటు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, జిల్లా కోశాధికారి జ్యోతీశ్వరరావు తెలిపారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాల్లో 29 చట్టాలను మార్పు చేసి నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చిందన్నారు. మన రాష్ట్రంలో చంద్రబాబునాయుడు ప్రభుత్వం 8 గంటల పని దినాన్ని 10 గంటలకు పెంచుతూ చట్టం చేసిందన్నారు. దీనిని కార్మిక వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని చెప్పారు. సిటు ఏర్పడ్డ 55 ఏళ్ల కాలంలో తొలిసారిగా అఖిల భారత మహాసభలు విశాఖ మహానగరంలో జరుగుతున్నాయని, దీనికి ఆతిథ్యం ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిటు జిల్లా కార్యదర్శులు పి.మణి, బి.జగన్, ఉపాధ్యక్షులు కుమార్ మంగళం, ఆర్‌ఎస్‌ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు


ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద ప్రారంభమైన ర్యాలీని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. రేసవానిపాలెం నుంచి సత్యం కూడలి మీదుగా తిరిగి రేసవానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. అనంతరం బాలికలను ఉద్దేశించి డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు మాట్లాడుతూ బాలురు, బాలికల నిష్పత్తి సమానంగా ఉండాలన్నారు. విశాఖ జిల్లాలో ప్రతి 1000 మంది బాలురకు 969 మంది బాలికలు ఉన్నారని, ఈ నిష్పత్తి సమానంగా ఉండేలా చూడాలని ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్టు ప్రకారం అల్ట్రాసౌండ్ స్కానింగ్ కేంద్రాలు లింగ నిర్ధారణ పరీక్షలు చేయరాదని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బాలికలు అన్ని రంగాలలోను ముందున్నారని కొనియాడారు. ఐసీడీఎస్ పీడీ కె.వి.రామలక్ష్మి మాట్లాడుతూ సేవ్ గర్ల్ చైల్డ్‌ను ఉద్దేశించి లింగ వివక్ష ఉండరాదని, బాలికలు ధైర్యంగా ప్రతి విషయాన్ని ఎదుర్కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మీడియా విస్తరణాధికారి (డెమో) బి.నాగేశ్వరరావు, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ లూసీ, నోడల్ అధికారి ఎం.సత్యవతి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, ట్రైనీ నర్సుల్లు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అద్భుతం.. నృత్యోత్సవం


కూచిపూడి నృత్య ప్రదర్శనలో చిన్నారులు

మద్దిలపాలెం: కళాభారతిలో పద్మభూషణ్ డాక్టర్ వెంపటి చిన్న సత్యం 96వ జయంతిని పురస్కరించుకుని విశాఖ ఆర్ట్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్ , వెంపటి చిన్న సత్యం స్థాపించిన కూచిపూడి కళాక్షేత్రం సంయుక్తంగా రెండు రోజుల ఆంధ్రప్రదేశ్ శాస్త్రీయ సంప్రదాయ నృత్యం, కూచిపూడి వెంపటి జయంతి నృత్యోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభించారు. తొలి రోజు కార్యక్రమంలో సుమారు 400 మంది చిన్నారులు తమ నృత్య ప్రదర్శనలతో ప్రేక్షకులను అబ్బురపరిచారు. నగరంలో గల నాట్య గురువులందరి సహకారంతో ఈ కార్యక్రమం అద్భుతంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సెంచురియన్ యూనివర్సిటీ చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు, వీఎండీఏ అధ్యక్షుడు ఎంఎస్ఎన్ రాజు, విజయనిర్మల్ అండ్ కంపెనీ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సూరపనేని విజయ్ కుమార్, విజయనిర్మల కంపెనీ చైర్మన్ ఎంఎస్ శ్రీనివాస్, కూచిపూడి కళాక్షేత్ర కార్యదర్శి కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ నేటి తరం విద్యార్థులు ఏదో ఒక సంప్రదాయ నృత్యం, సంప్రదాయ కళ నేర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విశాఖ నగరంలోని నాట్య గురువులను సత్కరించారు. అలాగే విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు.

సిరులతల్లికి తులసిపూజ

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం తులసిపూజ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.